



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ



ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

అన్ని వసతులు కల్పించాలి

- విద్యార్థుల ఆందోళనతో స్పందించిన కలెక్టర్
- తుర్కపల్లి బీసీ గురుకులం పరిశీలన

శామీర్‌పేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను బాధ్యతగా కల్పించాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. సోమవారం తుర్కపల్లి బీసీ గురుకుల పాఠశాలలో సరైన వసతులు లేవని, ప్రిన్సిపాల్ తమకు వద్దని విద్యార్థులు ఆందోళన చేసిన విషయం విదితమే. మంగళవారం మీడియా ద్వారా విషయం తెలుసుకున్న కలెక్టర్ మను చౌదరి మంగళవారం పాఠశాల, జూనియర్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గదిలో బియ్యం, ఇతర సరుకులను పరిశీలించారు. అలాగే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల, వార్డెన్‌ల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల సమ్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నిత్యం మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలని ఆదేశించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు విద్యా బోధనపై పలు సూచనలు చేశారు. బాగా చదువుతూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఇంటర్‌బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

తాండూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మేరా యువ భారత్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెట్లు మానవాళికి ఎంతో ఉపయోగపడుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధికారి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

సంవత్సరాలు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మాత్రం మారడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వారి ఇబ్బందులు, కష్టాలను పాలకులు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం టైం స్కేల్ ఇస్తామని ప్రకటించి పాలాభిషేకాలు చేయించుకుని మోసం చేసిందన్నారు. అలాగే అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ కూడా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధనకు గతేడాది డిసెంబర్ 6వ తేదీ నుంచి జనవరి 7 వరకు నిరవధికంగా సమ్మె కొనసాగించిన విషయం తెలిసిందే.



రెగ్యులరైజ్ చేయాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిబ్బంది (ఫైల్)

క్రమబద్ధీకరణ.. ఒట్టిమాటేనా?

కార్యరూపం దాల్చని ఎస్ఎస్ ఉద్యోగుల డిమాండ్లు

- సమ్మె చేసినా పరిష్కారానికి నోచని సమస్యలు
- చాలీచాలని వేతనాలతో భారంగా కుటుంబాల నిర్వహణ
- ప్రభుత్వంపై నమ్మకంతో ఆశగా ఎదురుచూపులు
- జిల్లాలో మొత్తం 788 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు

హామీలు నిలబెట్టుకోవాలి



సమ్మె సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. సమగ్ర శిక్షను పూర్తి స్థాయిలో విద్యా శాఖలో విలీనం చేసి ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలి. పేస్కేల్ అమలు కోసం మంత్రివర్గ ఉప సంఘం సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం వెంటనే ప్రకటించాలి. సమ్మె కాలపు వేతనాలు వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-గంగ్యానాయక్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్

వికారాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యాశాఖ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అమలు కావడంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం బియ్యం సరఫరా, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, ఆన్‌లైన్‌లో విద్యార్థుల నమోదు, బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం వంటి పనులు నిర్వహిస్తున్నారు. గురుకులాల్లో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు బోధన విధులు నిర్వహిస్తుండగా, బోధనేతర సిబ్బంది తమకు కేటాయించిన విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రత్యేకాధికారులు (ఎస్ఓలు) కేజీబీవీల నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. అకౌంటెంట్లు, ఏఎస్ఎంలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, మండల స్థాయిలో సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, వ్యాయామ, ఒకేషనల్ ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, డే/నైట్ వాచ్ ఉమెన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు, జిల్లా స్థాయిలో మిగతా 8వ పేజీలో...

చాలీ చాలని వేతనాలతో..

సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిబ్బంది చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా వేతనాలు పెరగక.. వచ్చే వేతనంతో కుటుంబం పోషించుకోలేక ఇక్కట్లు పడుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా.. వచ్చే వేతనంతో కనీస అవసరాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతూ మానసికంగా కుంగిపోతున్నామని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్ట్‌టైం ఉద్యోగులను ఫుల్‌టైం ఉద్యోగులుగా గుర్తించి వేతనం పెంచాలని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు రూ.20 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్ చెల్లించాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని, ప్రతీ ఉద్యోగికి రూ.10 లక్షలు జీవిత బీమా, రూ.5 లక్షలు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

'మహా గర్జన'ను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

వికారాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచేందుకు ఆగస్టు 13న హైదరాబాద్‌లో దివ్యాంగుల, చేయూత మహాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతకాకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలన్నారు. మంగళవారం వికారాబాద్‌లో నిర్వహించిన గర్జన సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో పింఛన్ మొత్తాన్ని రెండు వేలు పెంచుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలు గడుస్తున్నా నెరవేర్చలేదన్నారు. అందాల పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.100 కోట్లు ఖర్చు చేశారు. కానీ, పింఛన్ సొమ్మును పెంచడం లేదని మండిపడ్డారు. పింఛన్‌దారుల పక్షాన, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి పక్షాన నిర్వహించే ఈ సభ రాజకీయాలకు సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆనంద్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విచారణకు హాజరైన ధారాసింగ్



తాండూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయక్ మంగళవారం నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని పోలీసులు నిర్ధారణ చేసి దానికి సంబంధించిన పలు విషయాలను అడిగినట్లు తెలిపారు. కేసు విచారణలో భాగంగా పోలీసులు ఎప్పుడు పిలిచినా సహకరిస్తానని ఆయన తెలిపారు.

కొత్తకుంట ఆధునికీకరణ తర్వాత ఊహా చిత్రం



పరిగికి కొత్తకుంట శోభ

ట్యాంక్‌బండ్ తరహాలో సుందరీకరణ

- రూ. 3 కోట్ల నిధులతో ప్రతిపాదనలు
- మొదటగా రూ. 29 లక్షలతో పనులు
- లైటింగ్ సిస్టమ్, గ్రీనరీ ఏర్పాట్లు
- ఎఫ్‌టీఎల్ చుట్టూ ఫెన్సింగ్

పరిగి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణం సమీపంలోని కొత్తకుంట ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు. మినీ ట్యాంక్‌బండ్ తరహాలో కుంటను అభివృద్ధి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ కుంటకు 29 ఎకరాల ఎఫ్‌టీఎల్ పరిధి ఉంది. కుంట కింద 45 ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా, ఈ కుంటను అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. మొదటి దశలో కట్టను పటిష్టం చేయడంతో పాటు దెబ్బతిన్న అలుగు నిర్మాణ పనులను పునరుద్ధరిస్తున్నారు.

మరిన్ని నిధులు అవసరం

గత మార్చి 11న రూ.29 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో అలుగు, కట్ట వెడల్పు పనులు మిగతా 8వ పేజీలో...

పరిగి కొత్తకుంట అలుగు



అందంగా తీర్చిదిద్దుతాం

మొదటి విడతలో రూ.29 లక్షలతో కొత్తకుంట అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రస్తుతం కట్ట వెడల్పు పనులు జరుగుతున్నాయి. కుంటను మినీ ట్యాంక్‌బండ్ తరహాలో ఆధునీకరిస్తాం. రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో 29 ఎకరాలకు ఫెన్సింగ్ వేయిస్తాం. పట్టణ ప్రజలు సేదతీరేలా లైటింగ్, గ్రీనరీని ఏర్పాటు చేస్తాం.

- డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

బాధితులకు మరింత భరోసా



భరోసా కేంద్రం సిబ్బందితో ఎస్పీ నారాయణరెడ్డి

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలకు భరోసా కేంద్రం అండగా నిలుస్తోందని ఎస్పీ నారాయణరెడ్డి కేంద్రం సేవలను కొనియాడారు. జిల్లా పోలీస్ కేంద్రంలోని భరోసా కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా ఆయన కేంద్రాన్ని సందర్శించి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. బాధితులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు అందించారు. అనంతరం బాధిత మహిళలకు విక్టిమ్ అస్సిస్టెంట్ ఫండ్ కింద ఆర్థిక సహాయంగా చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గృహ హింస, లైంగిక వేధింపులు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి అన్ని విధాలా సహాయం అందిస్తుందన్నారు. భవిష్యత్తులోనూ భరోసా కేంద్రం సేవలను విస్తరించి, మరింత మందికి చేరువ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు హనుమంత్‌రావు, మురళీధర్, డీఎస్పీలు, భరోసా కేంద్రం సమన్వయకర్తలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీరో ఎఫ్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు

జీరో ఎఫ్ఐఆర్ కేసులపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, అలాంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులు కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా గ్రీవ్ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు జరుగాలన్నారు. సీసీటీవీ కెమెరాల వ్యవస్థను మరింత విస్తరించాలన్నారు. మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్లలో 5S విధానాన్ని అమలు చేసి పరిశుభ్రత, క్రమ శిక్షణను పాటించాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు ఎస్పీలు మురళీధర్, టీవీ హన్మంత్‌రావుతో పాటు తాండూరు పరిగి, వికారాబాద్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



పాములతో భద్రం

పొలం పనుల్లో అప్రమత్తత అవసరం
కాటేస్తే మంత్రాలు, పసరు వైద్యంతో ప్రాణాలకు ముప్పే
వైద్యుడిని సంప్రదించడం మేలు
7

జొన్నల డబ్బులు ఇవ్వండి సారూ..

40 రోజులుగా ఎదురుచూస్తున్న రైతులు
6

లక్ష్యాలను అధిగమించాలి

- ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి
- దిశ సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మైనింగ్, ఇరిగేషన్ శాఖల పనితీరుపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, శిశు సంక్షేమం, పౌర సరఫరాలు, పరిశ్రమలు, పశు సంవర్ధక, మిషన్ భగీరథ, నేషనల్ హైవేస్, హౌసింగ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, మునిసిపల్, ఫారెస్ట్, బ్యాంకింగ్ శాఖల పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. లక్ష్యం మేరకు అన్ని రంగాలకు బ్యాంకర్లు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంట రుణాలు, ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు విరివిగా రుణాలు విడుదల చేయాలన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేసేలా..

జిల్లాలో ఈజీఎస్ కింద గత మూడు నెలల్లో రూ.91.83 కోట్లు కూలీలకు కూలి లభించిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మిగతా 8వ పేజీలో...



ఆహ్లాదం.. ఆందోళన!

చూసేందుకు ఈ రోడ్డు పచ్చదనంతో ఆహ్లాదకరంగా, అందంగా కనిపిస్తున్నా దాని వెనుక ఓ ప్రమాదం దాగి ఉంది. వికారాబాద్ నుంచి అనంతగిరికి వెళ్లే రోడ్డు ఇది. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించని పరిస్థితి. దీనికితోడు చెట్లకొమ్మలు వాహనాలకు తాకుతుండటంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే ఆర్అండ్‌బీ, ఫారెస్ట్ అధికారులు స్పందించి రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

-వికారాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి)



విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

దోమ, జూలై 15(ఆంధ్రజ్యోతి): అయినాపూర్‌లో విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఇటీవల గ్రామస్తులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కోరారు. మంగళవారం గ్రామస్తులు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్‌గౌడ్, సర్దార్, జహంగీర్, ఖదీర్ ఉన్నారు.


వినతిపత్రం ఇస్తున్న అయినాపూర్ గ్రామస్తులు

జుంటువాగు కబ్జాను అడ్డుకోరా?

- బఫర్‌లో గదుల నిర్మాణం
- హద్దులు చెరిపి మరీ వాగు ఆక్రమణ
- చర్యలకు అధికారుల మీనమేషాలు

బషీరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జుంటువాగు కబ్జా, బఫర్ జోన్‌లో నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తాండూరు-బషీరాబాద్ రోడ్డులో గల జుంటువాగులో కబ్జా చేశారని కొన్ని రోజుల కింద అధికారులు హద్దులు పాతారు. అయితే ఓ భూ యజమాని హద్దుల తొలగించి నిర్మాణం చేపడుతున్నాడు. జుంటువాగు కబ్జాపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రతీక్‌జైన్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకరప్రసాద్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో గత గురువారం యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, తాండూరు ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్య, ఏఈ భానుప్రకాశ్‌రెడ్డి, ఆర్‌ఐ శివచరణ్, సర్వేయర్, సిబ్బంది వాగును సందర్శించి వాగుకబ్జా, గదుల నిర్మాణం నిజమేనని తేల్చారు. అధికారులు అప్పటికప్పుడు సర్వేచేయించి హద్దులు పాతించారు. చెక్‌డ్యామ్ వింగ్‌వాల్‌ను కూల్చి బఫర్‌లో భూ యజమాని గదులు నిర్మిస్తున్నాడని తేల్చారు. అధికారులు భూ యజమాని గోపాల్‌తో మాట్లాడి బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాన్ని కూల్చాలని ఆదేశించారు. ఇందుకు గోపాల్ సరేనని పోసిన మట్టిని తొలగిస్తానని అధికారులను నమ్మించాడు. ఆ తర్వాత ఇటువైపు ఎవరూ రాకపోవడంతో గోపాల్ నిర్మాణాన్ని కొనసాగిస్తూ గదులకు పైకప్పు పూర్తి చేశాడు. అక్రమ నిర్మాణంపై చర్యలకు అధికారులు వెనకడుగు వేస్తున్నారని గ్రామ రైతులు ఆరోపణలొస్తున్నాయి. ఈ విషయమై యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, తాండూరు ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్యల స్పదన కోరగా.. గదులు నిర్మించిన భూమి తాండూరు రెవెన్యూలోకి వస్తుందన్నారు. వాగు కబ్జా, బఫర్‌లో గదుల నిర్మాణంపై తాము ఇప్పటికే కలెక్టర్‌కు నివేదించామని తెలిపారు. గదుల నిర్మాణంపై తాండూరు తహసీల్దారే చర్యలు తీసుకుంటారని వారు చెప్పుకొచ్చారు.


జుంటువాగు బఫర్‌లో నిర్మిస్తున్న గదులు

జొన్నల డబ్బులు చెల్లించండి సారూ..

40రోజులుగా అందని జొన్నల డబ్బులు

బంట్వారం జూలై 15(ఆంధ్రజ్యోతి): జొన్నల డబ్బులు చెల్లించండి సారూ.. అని మండల రైతులు కోరుతున్నారు. గత యాసంగిలో పండించిన జొన్నలను నెల రోజుల క్రితం మర్పల్లి ప్యాక్స్ కొనుగోలు కేంద్రాల్లో వివిధ గ్రామాల 40 మంది రైతులకు విక్రయించారు. 15రోజుల్లో డబ్బులు ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెప్పారు. 40రోజులవుతున్నా డబ్బులు రైతుల ఖాతాల్లో వేయలేదు. దీంతో రైతులు వానకాలం పంట పెట్టుబడులకు, పిల్లల స్కూలు ఫీజులకు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. జొన్నల డబ్బులు పంట పెట్టుబడికి వస్తాయనుకుంటే ఇంకా ఖాతాల్లో వేయడం లేదని రైతులు ఆదోళన చెందుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మినా వెంటనే డబ్బులిచ్చేవారని వాపోతున్నారు. విత్తనాలు, ఎరువులకు వడ్డీకి అప్పులు తీసుకున్నామని చెబుతున్నారు. 15 రోజుల్లో ఖాతాల్లో డబ్బులు చేస్తామని అధికారులు చెప్పడంతోనే కొనుగోలు కేంద్రాల్లో జొన్నలను విక్రయించామంటున్నారు. అధికారులిచ్చిన రశీదులతో ఇప్పుడు వారి వద్దకు వెళ్తే.. 'మాకేం తెల్వదు. ప్రభుత్వం ఎప్పుడు వేస్తే అప్పుడే మీ ఖాతాల్లో డబ్బులు పడతాయి.' అని చెప్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే తమ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని జొన్నల రైతులు కోరుతున్నారు.


రైతుకు కొనుగోలు కేంద్రంలో ఇచ్చిన రశీదు

ఈజీఎస్ పనులు పారదర్శకంగా చేపట్టాలి


సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న పీడీ శ్రీలత

కడ్తాల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి పారదర్శకంగా చేయాలని డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత సూచించారు. పనుల్లో పొరపాట్లకు, అక్రమాలకు తావివ్వొద్దని మండల అధికారులు, సిబ్బందికి సూచించారు. కడ్తాల రైతు వేదికలో మంగళవారం ఉపాధి హామీ నాలుగో విడత సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. ఎంపీడీవో సుజాత అధ్యక్షత వహించారు. పీడీ, ఏపీడీ సుభాషిణి హాజరయ్యారు. 2024-2025లో 24 పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. చేపట్టిన పనులు, నిధుల ఖర్చు, కూలీలకు చెల్లింపులపై పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ ఈజీఎస్ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి నాణ్యతగా చేయాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. పొరపాట్లకు, అక్రమాలకు తావివ్వొద్దని సూచించారు. మొక్కలు ఎండకుండా సంరక్షించాలని సిబ్బందికి ఆదేశించారు. అక్రమాలకు తావిస్తే రికవరితో పాటు చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో లాలయ్య, ఏపీవో లలిత, ఏపీఆర్ పరమేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని పీడీకి వినతి

నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు కలుగుతున్నాయని ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది డీఆర్డీఏ పీడీ శ్రీలతకు తెలిపారు. పీడీ, ఎంపీడీవోలకు వారు వినతి పత్రాలు అందజేశారు. నెలల పాటు వేతనాలందక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. వేతనాలు వెంటనే ఇప్పించాలని కోరారు.కార్యక్రమంలో ఈజీఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్, శ్రీను, బి.సత్తయ్య, యాదగిరి, రమేశ్, లక్ష్మణ్, సువర్ణ, బేగం పాల్గొన్నారు.

యాదయ్యగౌడ్ సేవలు మరువలేనివి

మహేశ్వరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి దివంగత డాక్టర్ తూళ్ల యాదయ్యగౌడ్ చేసిన సేవలు మరిచిపోలేనివని మాజీ హోం మంత్రి టి.దేవేందర్‌గౌడ్ అన్నారు. మహేశ్వరం గేటు సమీపంలో పది ఎకరాలు భూమిని జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు విరాలంగా ఇచ్చిన మహానుభావుడు యాదయ్యగౌడ్ అన్ని అన్నారు. ఆయన విగ్రహాన్ని పాఠశాల ప్రాంగణంలో మంగళవారం దేవేందర్‌గౌడ్, తన కుటుంబసభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నాడు ముందు చూపుతో రూ.2వందల కోట్ల విలువ చేసే భూమిని పేద విద్యార్థుల కోసం విద్యాలయం ఏర్పాటు చేయాలనే విరాలంగా ఇచ్చారని కొనియాడారు. పాఠశాల అభివృద్ధి, ఇతరాల కోసం యాదయ్యగౌడ్ కుటుంబీకులు రూ.10లక్షల డబ్బును పాఠశాల ఖాతాలో జమ చేయడం మామూలు విషయం కాదన్నారు. ఇక్కడ చదువుతున్న ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహేశ్వరం ప్రాంతం ఎప్పటికైనా ప్రపంచ రికార్డుల్లో స్థానం పొందాలని యాదయ్యగౌడ్ ఎప్పుడూ ఆలోచించేవారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తూళ్ల కుటంబం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యాదయ్యగౌడ్ సతీమణి ఆదిలక్ష్మి, కుమారుడు కిషోర్, టి.వినోద, విజయేందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.


యాదయ్యగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

ఆమనగల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్ ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండ చూడాలని కోరారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శివశంకర్‌తో కలిసి శంకర్ సందర్శించారు. కళాశాల ఆవరణ, గదులను పరిశీలించి విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక ఇబ్బందులు కలుగుతున్నాయని, అసంపూర్తి భవన నిర్మాణ పనులు పూర్తిచేయించాలని విద్యార్థులు కోరారు. భవన నిర్మాణం విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకొని భూ వివాదాన్ని పరిష్కరించి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని శంకర్ కోరారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు చెట్లకింద తరగతులు తప్పడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా జూనియర్ కళాశాల భవన నిర్మాణం పూర్తికావడం లేదని విచారం వ్యక్తం చేశారు. డిగ్రీ, జూనియర్ కాలేజీలకు భవనాలు నిర్మించి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, సాయికుమార్, డీవైఎఫ్ఐ శివశంకర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

అందుబాటులో 438 టన్నుల యూరియా


మాట్లాడుతున్న ఏడీఏ రుద్రమూర్తి

తాండూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాండూరులో రైతులకు 438 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తాండూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రుద్రమూర్తి తెలిపారు. మంగళవారం తాండూరులోని శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాండూరులో యూరియా కొరత లేదన్నారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ కొందరు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తాండూరు మండలంలో 162 టన్నులు, బషీరాబాద్‌లలో 125 టన్నులు, యాలాలలో 98టన్నులు, పెద్దేముల్‌లోనూ యూరియా అందుబాటులో ఉందన్నారు. తాండూరు ప్రాంత అన్ని మండలాల్లో డీఏపీ 98 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు బషీరాబాద్‌లో 117 టన్నులు, తాండూరులో 226 టన్నులు, పెద్దేముల్‌లో 52 టన్నులు, యాలాలలో 26 టన్నులు ఉందని వివరించారు.

ఏడీఏ రుద్రమూర్తి బదిలీ

తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు. ఇక్కడ మూడున్నరేళ్లపాటు పనిచేసిన రుద్రమూర్తి ఆసిఫాబాద్ జిల్లా కార్యాలయానికి డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. త్వరలోనే ఆయన తాండూరు నుంచి రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.

రైతులకు ఉపయోగపడేలా సహకార సంఘాలు పని చేయాలి

రాజేంద్రనగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సహకారం పరపతి సంఘాలు పని చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మంగళవారం తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో 311ఎఫ్‌పీఓలతో నిర్వహించిన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కేవలం ఒకటి లేదా రెండు సేవలకు పరిమితం కాకుండా, రైతులకు సంబంధించి అన్ని సేవల రూపకల్పనలో పాలుపంచుకుంటే ఆర్థిక పరిపుష్టితో పాటు రైతులకు ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. సహకార రంగంలో దేశవ్యాప్తంగా రోల్ మోడల్‌గా నిలిచిన ముల్కనూరు సహకార పరపతి సంఘ విజయాల్ని ప్రస్తావిస్తూ.. సహకార సంఘ బాధ్యతలు నీతిగా, నిజాయితీగా నిర్వహిస్తే ఇలాంటి సహకార సంస్థలు మరిన్ని ఉద్భవిస్తాయని చెప్పారు. సహకార సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలుగా' మార్చి వారికి మరింత ఆర్థిక తోడ్పాటు అందించే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్‌ను బిజినెస్ ఆర్గనైజేషన్‌గా నియమించి 311 సంఘాలను ఎఫ్‌పీఓలుగా ఎన్నిక చేశామని చెప్పారు.


ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న చంద్రశేఖర్

డిమాండ్ల సాధనకు పీఆర్‌టీయూ పోరాటం

వికారాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ అవిశ్రాంత పోరాట ఫలితంగానే ఉపాధ్యాయులకు అప్రెంటిస్‌షిప్ రద్దయిందని, నోషనల్ ఇంక్రిమెంట్లు, లేడీ టీచర్లకు చైల్డ్‌కేర్ సెలవులు మంజూరయ్యాయని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం శివారెడ్డిపేట జెడ్పీ, వికారాబాద్ జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో ఆయన యూనియన్ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించారు. ఉపాధ్యాయుల డిమాండ్ల పరిష్కారానికి 52ఏళ్లుగా పీఆర్‌టీయూ పోరాటం చేస్తోందన్నారు. రాజకీయ పార్టీలకు అనుబంధంగా కాకుండా ఉపాధ్యాయుల సంక్షేమానికే కృషిచేసే సంఘం పీఆర్‌టీయూ అని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల నియామకం, 010 పద్దు ద్వారా వేతనాల చెల్లింపు, మెటర్నిటీ, పెటర్నిటీ లీవులు కూడా పీఆర్‌టీయూ సాధించిన విజయాలేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం వికారాబాద్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేదార్‌నాథ్, పట్నం రాఘువేందర్, గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్, జీహెచ్‌ఎంలు శ్రీశైలం, జనార్ధన్ రెడ్డి, జిల్లా, రాష్ట్ర బాధ్యులు రమేష్ షిండే, వీరేశం, జహంగీర్, యాదగిరి, వేణుగోపాల్, శ్రీనివాస్, రాములు, చంద్రయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్


మాట్లాడుతున్న పవన్‌కుమార్

మూడుచింతలపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో మంగళవారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన రోడ్లు, వార్డు కార్యాలయాలు, ఆలయాల వద్ద పిచ్చిమొక్కలను తొలగించారు. కేశవరంలో మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ యునైటెడ్ వే స్వచ్ఛంద సంస్థ సిబ్బందితో పర్యటించి సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. డ్రై అండ్ వెట్ వేస్ట్ విషయమై చర్చించారు. వర్షాలు పడగానే మొక్కలు నాటుతామని అధికారులు పేర్కొన్నారు.


ప్రభుత్వ భూమి హద్దులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూమి పరిశీలన

ఘట్‌కేసర్ రూరల్, జూలై15(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, కాచవాని సింగారం పరిధి సర్వే నంబర్ 66లోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. కబ్జా విషయమై పలుమార్లు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి హద్దురాళ్లను తనిఖీ చేశారు. త్వరలో పూర్తిస్థాయిలో డిజిటల్ సర్వే చేస్తామని రెవెన్యు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వేయర్లు బలిరామ్, సత్యమ్మ, రూప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కులకచర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కిరణ్ కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం బండవెల్కిచర్ల ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. వంట గది, కూరగాయలు నిల్వ ప్రాంతాన్ని పరిశీలించారు. కూరగాయలతో ఆహారం వండి విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్, హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీకి ఘన సన్మానం


అదనపు ఎస్పీ హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

వికారాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీగా సేవలందించిన టీవీ.హనుమంతరావు రాచకొండ కమిషనరేట్‌కు బదిలీపై వెళుతున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. హనుమంత్‌రావు నేర నివారణ, శాంతి భద్రతల పరిరక్షణలో గొప్పగా సేవలందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పీవీ.మురళీధర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించం

యాలాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజర్ రాజేందర్ హెచ్చరించారు. రాస్నం కంపార్ట్‌మెంట్ నెంబర్-112లోని అటవీ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అటవీ భూమి పరిరక్షణకు తవ్విన కందకాన్ని కొందరు చదును చేసి రోడ్డులా మార్చారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో హెచ్చరించారు. సర్వే నంబర్-33, 152ల రైతుల పొలాలకు వెళ్లేందుకు బాట వేసుకున్నట్టు గుర్తించారు. దీంతో రేంజర్ బాటపై మరోసారి కందకాన్ని తవ్వించారు. రాస్నంలో కొందరు రైతులు అటవీ భూమి దున్నేస్తున్నారని చెప్పారు. తమ పేరిట ఉన్న భూమి కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులు అటవీ భూమిని స్వచ్ఛందంగా వదిలేయకుంటే నోటీసులిస్తామని హెచ్చరించారు. అటవీ, వన్య ప్రాణుల మనుగడకు ప్రజలు సహకరించాలని ఎఫ్ఆర్వో కోరారు.

వేంకటేశ్వరుడి సేవలో సినీ నటి రష్మిక


రష్మికకు స్వామి వారి ప్రతిమను అందజేస్తున్న చైర్మన్ మురళీధర్‌రెడ్డి దంపతులు

కందుకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరు గ్రామంలో వెలసిన ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం ప్రముఖ సినీ నటి రష్మిక మందన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆమెతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్‌రెడ్డి దంపతులు రష్మికను ఘనంగా సన్మానించారు. రష్మిక మాట్లాడుతూ ఆలయానికి ఘనమైన చరిత్ర ఉందని, స్వామివారిని నమ్ముకున్న వారికి కొంగుబంగారంలా వరాలిస్తాడని అన్నారు. తాను కూడా వేంకటేశ్వరస్వామిని నమ్ముకొని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు ఆమెతో ఉన్నారు.


ఘనంగా సీత్లా వేడుక

ఘట్‌కేసర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీత్లా అమ్మ వారిని కొలిస్తే వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని, పశుపక్ష్యాదులు, జీవులు వ్యాధులబారిన పడవని ఎన్ఎఫ్‌సీ నగర్ గోర్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోత్‌రాములు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లోని బ్యూటిరెస్ట్ కాలనీలో మంగళవారం సీత్లా పండుగ సందర్భంగా సీత్లా భవాని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, చెన్నారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మణ్‌నాయక్, బానుక వాల్యా నాయక్, పూజారి మోతీలాల్ నాయక్, పురుషోత్తమ్ నాయక్, డీజీ నాయక్ పాల్గొన్నారు.

పాములతో జరభద్రం..

పొలం పనుల్లో అప్రమత్తంగా ఉండాలి

- పాము కాటేస్తే మంత్రాలు, పసరు వైద్యంతో ప్రాణాలకు ముప్పే
- వైద్యమే శ్రేయస్కరం.. యాంటీ స్నేక్ వీనం ఇంజెక్షన్ తప్పనిసరి





బషీరాబాద్/కొడంగల్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి):వర్షాకాలంలో అన్ని ప్రాంతాల్లోనూ పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పొలాలు, పొదలు, మరుగు ప్రదేశాలు, పాడుబడిన ఇళ్లలో సర్పాలు ఎక్కువ సంచరిస్తాయి. వేసవి తాపం నుంచి సేదదీరేందుకు పాములు, ఇతర విషకీటకాలు పుట్టలు, పొదల్లోంచి బయటకు వస్తుంటాయి. సాధారణంగా పొలం పనుల్లో రైతులు, కూలీలు ఎక్కువగా పాముకాటుకు గురవుతుంటారు. అలాగే సంక్షేమ హాస్టళ్లు, స్కూళ్ల విద్యార్థులకు సైతం సర్పాల ప్రమాదం పొంచి ఉంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు పాములు, తేళ్లు, ఇంగ్లీకాలు, జెర్రిలు వంటి విషకీటకాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ధాన్యపు గాదెలు, ఒందలు, పొలం గట్లు, సొప్ప కుప్పలు, గడ్డివాముల్లో ఉండే కప్పలు, ఎలుకలను తినేందుకు పాములు వస్తుంటాయి. మరుగు ప్రదేశాల్లో పాములు గుడ్లుపెట్టి పిల్లలు చేస్తాయి. ఇలాంటి ప్రదేశాల్లో సంచరించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. రాత్రి సమయాల్లో ఇటువైపు అస్సలు వెళ్లొద్దు. వెళ్లాల్సి వచ్చినా టార్చ్‌లైట్ తప్పక తీసుకెళ్లాలి. ఇళ్లలో ఎక్కడా చెత్త చెదారం పేరుకోకుండా చూసుకోవాలి. గదుల్లో చీకటి లేకుండా చూసుకోవాలి. ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పిచ్చిమొక్కలు, చెత్త ఉండనీయొద్దు. ఇళ్ల కిటికీలకు, తలుపులకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా పాముకాటుకు గురైతే నాటు వైద్యం, మంత్రాలను ఆశ్రయించకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకుపోవాలి. పాముకాటు విరుగుడుకు వైద్యులు 'యాంటీ స్నేక్ వీనమ్' ఇంజక్షన్ ఇస్తారు.

పాము ఎప్పుడు కాటేస్తుందంటే...

పొలం/కాలువ గట్లు, పశువుల కొట్టాలు, పొదలు, గడ్డివాములు, పాడుబడిన ఇళ్లు, కట్టెలు, పెంట దిబ్బల్లో పాములు తిష్టవేస్తూ బల్లులు, తొండలను తింటుంటాయి. స్టార్టర్ బాక్సుల్లోనూ పాములు చుట్టుకొని పంటాయి. బాక్సుల డోర్లు తీసే సమయంలో జాగ్రత్తగా గమనించాలి. పాములకు ప్రాణభయం ఉన్నప్పుడు, వాటి ఏకాంతానికి భంగం కలిగినపుడు, తొక్కినప్పుడు క్షణ కాలంలో కాటేస్తాయి.

సర్పం కరిస్తే ఆలస్యం చేయొద్దు

పాముల్లో చాలా వాటికి విషముండదు. తాచుపాటు, నాగుపాము, కట్లపాము, శెడుగు, శెట్టిర్కపాటు వంటి కొన్ని రకాల పాములు అత్యంత విషపూరితమైనవి. కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తంలో కలుస్తుంది. వైద్యం అందకుంటే రెండు గంటల్లోపే ప్రాణాపాయం ఉంటుంది. బాధితుడ్ని వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి. నాగుపాము కాటేసిన 15 నిమిషాల్లోనే మనిషికి విషం ఎక్కుతుంది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. రక్త పింజర, కట్లపాము కాటేసిన రెండు గంటల్లోగా విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, నీరుకట్ట కాటేసినా ఏమీ కాదు. వాటికి విషం ఉండదు. అయితే పాము ఏదైనా కరిచిన వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలి.

విషం ఎక్కితే ఇలాంటి లక్షణాలుంటాయి..

విషపూరిత పాము కాటేస్తే మనిషి శరీరం నీలంగా మారుతుంది. రక్తపోటు పెరిగి మనిషి స్పృహ కోల్పోతాడు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. పాము కోరల గాట్లు కన్పిస్తాయి. పొక్కులు, దద్దుర్లు వస్తాయి. నాలుక లావవుతుంది. నోటి నుంచి నురుగ వస్తుంది.

ఆందోళనతో ఎక్కువ ముప్పు



పాము కరిచిన వ్యక్తి ఎక్కువ ఆందోళన చెందొద్దు. లేదంటే బీపీ ఎక్కువై గుండెపోటుకు గురయ్యే ఆస్కారం ఉంటుంది. కొన్నిసార్లు విషం కంటే భయమే ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. ఆస్పత్రిలో పాము కాటుకు యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు ఉన్నాయి. పాము కరిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే రోగిని ఆస్పత్రికి తీసుకురావాలి. పసరు మందులు, మంత్రాలను నమ్మి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. పొలాల వద్ద రైతులు జాగ్రత్తగా మసలుకుంటూ పనులు చేసుకోవాలి. మరుగు ప్రదేశాల్లో నేరుగా చేతిని పెట్టొద్దు. అక్కడ పాములు, తేళ్లు ఉండే అవకాశాలున్నాయి.

- డాక్టర్ గోపాల్, నవాల్గ పీహెచ్‌సీ


రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

ఆమనగల్లు/తలకొండపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా పోలీసు శాఖ అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతోందని శంషాబాద్ డీసీపీ బి.రాజేశ్ తెలిపారు. మంగళవారం డీసీపీ ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్‌లతో సమావేశమయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్టేషన్ పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేవారు. ఎన్నికల్లో భద్రతకు సంబంధించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలింగ్ బూత్‌ను సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను సైతం డీసీపీ తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. స్టేషన్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ, ఎస్సైలు ఎ.శ్రీకాంత్, కె.శేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్వోతో మాట్లాడుతున్న నాయకులు

కస్తూర్బా పాఠశాల సందర్శన

మర్పల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి నాయకులతో కలిసి సందర్శించారు. పాఠశాలలో వంట గది, నిత్యావసర సరుకులు నిల్వ చేసే, కంప్యూటర్ గదులను పరిశీలించారు. ప్రత్యేకాధికారితో మాట్లాడుతూ విద్యార్థులకు పురుగుల అన్నం ఎలా పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేశ్, నాయకులు బలరాంగౌడ్, యాదవరెడ్డి, శ్రీమంత్‌కుమార్, మధు, శేఖర్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తాం

- ప్రభుత్వ చీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్,జూలై 15(ఆంధ్రజ్యోతి):తాండూరు ప్రాంతంలో మరోసారి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జినుగుర్తి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పి.శ్రీనివాస్ మెమోరియల్ టోర్నీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి పి.రాములు అధ్యక్షత వహించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన సోదరుడు రాజేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం జిల్లాలో ఏటా క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాండూరులో 18 రాష్ట్రాల క్రీడాకారులతో పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని మాజీ మంత్రి తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు య.రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. జినుగుర్తిలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.ఉత్తంచంద్ మాట్లాడుతూ.. జినుగుర్తి యువత క్రీడల్లో ఎప్పుడూ ముందుంటుందని, వారికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల సీనియర్ నాయకులు సంపత్‌కుమార్, కె.పురుషోత్తంరావు, పి.రాంలింగారెడ్డి, సాయిరెడ్డి, ఆంజనేయులు, భద్రేశ్వర్, హెచ్‌ఎం రవీంద్రకుమార్, నాగప్ప, శేఖర్, సత్యనారాయణ, రాములు, నర్సింహులు పాల్గొన్నారు. వాలీబాల్ క్రీడాకారులను కలిసి మహేందర్‌రెడ్డి పరిచయం చేసుకున్నారు.


సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఆమనగల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమ్యలను స్థానికులు ఎమ్మెల్యేకు తెలుపగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు అనంతరం రేషన్‌కార్డులిచ్చి సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందిస్తున్నట్టు చెప్పారు. స్థానిక ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగేనని అన్నారు. కార్యక్రమంలో కాసు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనునాయక్, డాక్టర్ శ్రీను, వెంకటయ్య, సుమన్, మల్లేశ్‌గౌడ్, జగన్, రవీందర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

సమాజాన్ని మార్చే శక్తి మీడియాకుంది

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమాజాన్ని మార్చే శక్తి మీడియాకు ఉందని, నిష్పాక్షికంగా వాస్తవాలను వెలుగులోకి తేవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్తలాప్ మీడియా వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రతికూల వార్తలతో కాకుండా సానుకూల వార్తలతో కూడా సమాజంలో మార్పు తీసుకు రావచ్చన్నారు. మీడియా ప్రతినిధులు తమ వ్యక్తిత్వం, సొంత అభిప్రాయాలను జోడించకుండా ప్రజల అభిప్రాయాలు, వాస్తవాలనే బహిర్గతం చేయాలన్నారు. రాష్ట్రంలో వరి ఎక్కువ సాగవడానికి కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహమే కారణమన్నారు. కేంద్రం నుంచి ప్రతీ కుటుంబానికి రూ.80వేలు అందుతున్నాయన్నారు. అన్ని రాష్ట్రాల్లో కంటే మన రాష్ట్రంలోనే యూరియా ఎక్కువ వినియోగిస్తున్నారని, యూరియా ధరపై 90 శాతం సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మీడియా వారధిలా పని చేయాలన్నారు. వార్తలాప్ వర్క్‌షాప్ ద్వారా మీడియా మరింత ప్రజలకు చేరువ అవుతుందని భావిస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతిపాటిల్, డిప్యూటీ డైరెక్టర్ మానసకృష్ణకాంత్, ఎంఅండ్‌సీవో శివచరణ్, సీడీఏసీ ప్రాజెక్ట్ మేనేజర్ జగదీష్‌బాబు, ఎస్‌బీఐ ఏజీఎంలు విద్యాధర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్కేపల్లి రైతులకు న్యాయం చేయాలి


దీక్ష చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధి ఎన్కేపల్లిలో సర్వే నంబర్ 180లో దశాబ్దాలుగా పంటలు సాగు చేసుకుంటున్న రైతుల భూమిలో ప్రభుత్వం గోశాలఏర్పాటు చేయాలనుకోవడం సరికాదని, నిర్వాసిత రైతులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్కేపల్లి రైతుల రిలే నిరాహార దీక్షకు సంఘీభావంగా కార్తీక్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సాగు భూముల్లో గోశాల ఏర్పాటు చేస్తే రైతులెలా బతకాలని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల్లో ఐక్యత దెబ్బతీసేందుకు కొందరికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నారని విమర్శించారు. అందరికీ ఒకే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, డి.అంజనేయులు, డి.వెంకట్‌రెడ్డి, శ్రీహరియాదవ్, రవియాదవ్, శ్రీనివాస్, నరోత్తంరెడ్డి, అరవింద్, పరమేశ్, సునీల్ ఉన్నారు. కాగా మంగళవారం తొమ్మిదో రోజు రైతుల రిలే నిరాహార దీక్ష కొనసాగింది. భూమి పోయిన వారికి ఇళ్ల స్థలాలిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా రైతులు భీష్మిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రణాళిక

దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి

ఫేస్ టు ఫేస్



కీసర రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ క్రమంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళికపై కమిషనర్ వెంకట్‌రెడ్డి మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: వంద రోజుల ప్రణాళికలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. తడి, పొడి చెత్త నిర్వహణతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నాం. కాలనీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నాం. కాలనీల్లో, ఇళ్లల్లో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వన మహోత్సవం నిర్వహణ ఎలా?

కమిషనర్: వందరోజుల ప్రణాళికలో వనమహోత్సవం ప్రధానమైన అంశం. ఇప్పటికే దాదాపు 800 మొక్కలు నాటాం. మున్సిపల్ పరిధిలో కొనసాగిస్తున్న నర్సరీల్లో స్థానికంగా నాటేందుకు కావల్సిన మొక్కలు పెంపొందిస్తున్నాం. ఇంటికి రెండేసి మొక్కలు చొప్పున ఔషధ, పండ్ల మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మౌలికవసతులు కల్పిస్తున్నారా?

కమిషనర్: వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుతో పాటు స్ట్రీట్ లైట్లు అమర్చడం తదితర పనులు చేపడుతున్నాం. విలీన గ్రామాలతో పాటు ఇప్పటి వరకు దాదాపు 300స్ట్రీట్ లైట్లను అమర్చాం. మరో 300లైట్లు అందుబాటులో ఉన్నాయి.

సేవా కార్యక్రమాలు ముమ్మరం చేస్తాం



పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఘట్‌కేసర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని ఘట్‌కేసర్ లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అన్నారు. లయన్స్ క్లబ్ ఘట్‌కేసర్ ఉపాధ్యక్షుడు రేసు లక్ష్మారెడ్డి జన్మదిన సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వి.కేశవనాథం, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, మహేందర్, సందీప్, ప్రమోద్, కృష్ణ ప్రసాద్, నగేష్, శారద, లావణ్య, చందన పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయవాది, నాయకులు

దుద్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో హైకోర్టు న్యాయవాదులు లక్ష్మిగారి ఆంజనేయులు, బీసీ సంఘం నాయకులు, న్యాయవాది శివకుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు హైకోర్టు న్యాయవాదికి స్వాగతం పలికి దేవాలయ చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లప్పయాదవ్, వెంకట్రాములు, శివకుమార్ పాటిల్, శ్రీనివాస్, భూషణ్, కావలి గణేశ్, దిడ్డి జయశంకర్ పటేల్ పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ సిబ్బంది

దోమ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): లైన్‌మన్‌ను దూషించిన పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ముందు సిబ్బంది నిరసన తెలిపారు. అయినాపూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్ అదే గ్రామానికి చెందిన లైన్‌మెన్ రమేశ్‌ను దూషించడంతో పోలీసులు ఫిర్యాదు చేయడంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే పోలీసులు ఇంత వరకు చర్యలు తీసుకోలేదని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోపాల్, వెంకటయ్య, విద్యుత్ సిబ్బంది కృష్ణ, అంజనేయులు, సాయిలు, సురేశ్, పరమేశ్, సతీశ్, అజీమ్, నర్సిములు, లక్ష్మణ్, మహేందర్ ఉన్నారు.

విద్యార్థి దశ కీలకమైనది

పరిగి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదని సౌదీఅరేబియాలోని ఖాసీమ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, సురేశ్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ నంబర్ 1 పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో గోపాల్, పీడీ ఖాజా, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, ఎంవీఎఫ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

- పిల్లలు, వృద్ధులు, జీవాలపై దాడులు
- బెంబేలెత్తుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



కందనెల్లి తండా సమీపంలో కుక్కల స్వైరవిహారం

పెద్దేముల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పిల్లలు, పెద్దలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కుక్కల దాడులలో గాయపడ్డ వారు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలు కోల్పోతున్న ఘటనలతో జనం బెంబేలెత్తుతున్నారు. కుక్కల సంతతిని నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. పెద్దేముల్ మండలంలో ఊరకుక్కలు ఇటీవల స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లు, ఇళ్ల మధ్య గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడిచేస్తున్నాయి. గ్రామాల్లో కొంతమంది మేకలు, గొర్రెల పెంపకంతో ఉపాధి పొందుతుండగా మేతకు తీసుకెళ్లే సమయంలో వాటి కాపలాదారులు ఇంటివద్దనే చిన్నపాటి రక్షణ ఏర్పాటు చేసి వాటిపిల్లలను వదిలేస్తుంటారు. వాటిని కుక్కలబారిన పడకుండా కాపాడుకునేందుకు అనేక రక్షణ చర్యలు తీసుకుంటున్నా అవి దాటుకుని వెళ్లి మేకలు, గొర్రెపిల్లలపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి చంపితింటున్నాయి. కొన్నిసార్లు పిల్లలు, పెద్దలనూ వదలడంలేదు. రోడ్లపైన వాహనాలపై వెళ్తుంటే వెంబడించి కరుస్తున్నాయి. కుక్కలు మందలు మందులుగా రోడ్లపైకి వస్తుండడంతో వాహనదారులు వాటి బారినపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఒకప్పుడు కుక్కలు ఇళ్లముందుకు వస్తే ఇంట్లో మిగిలిపోయిన అన్నం, ఇతర ఆహార పదార్థాలు వాటికి వేసే వారు. అవివాటిని ఆరగించి ఇళ్లకు రక్షణగా నిలుస్తుండేవి. ప్రస్తుతం వాటికి ఇళ్లలో అన్నం, జొన్నరొట్టెలు వేసినా అవి తినడంలేదని, కేవలం మాంసాహారం వేస్తేనే తింటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిపోతున్న ఊరకుక్కల సంతతిని నియంత్రించాలని కోరుతున్నారు.

క్రమబద్ధీకరణ.. ఒట్టి మాటేనా?

(ఐదో పేజీ తరువాయి)



ఆర్డీవో కార్యాలయం ఎదుట రాత్రి వేళలో తమ పిల్లలతో కలిసి సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులు (ఫైల్)

సిస్టమ్ ఎనలిస్టులు, టెక్నికల్ పర్సన్లు, డీఎల్ఎంటీ మెసెంజర్లు, మోడల్ స్కూళ్లలో పని చేసే వార్డెన్లు, ఆపరేటర్లు, కేర్ టేకర్లు కూడా సమగ్ర శిక్ష పరిధిలోకే వస్తారు.

నివేదికల తయారీలో కీలకం

రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉండగా, వికారాబాద్ జిల్లాలో 788 మంది ఉన్నారు. కేజీబీవీల్లో 520, యూఆర్ఎస్‌లో 14, సీఆర్పీలు 59, ఐఈఆర్పీలు, ఎంఐఎస్సీవోలు 13, సీసీవోలు 15, మెసెంజర్లు 16, పీటీఐలు 98 మంది, మిగతా వారు ఇతర విభాగాల్లో పని చేస్తున్నారు. కలెక్టర్, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు పంపించే యూడైస్, మధ్యాహ్న భోజన పథకం నివేదికల తయారీలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. బియ్యం పంపిణీ, పాఠశాల బయట ఉన్న చిన్నారులను గుర్తించడం వంటి పనులు ఈ ఉద్యోగులే నిర్వహిస్తుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రాఫ్ట్, ఆర్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధించే ప్రత్యేక ఉపాధ్యాయులు కూడా ఎస్ఎస్ పరిధిలోకే వస్తారు.

కార్యరూపం దాల్చని సమ్మె హామీలు...

సమ్మె విరమణ సమయంలో పేస్కేల్ అమలుపై మూడు నెలల్లో మంత్రివర్గ ఉప సంఘం సమావేశం ఏర్పాటు చేస్తామని, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి వీలుగా ఉత్తర్వులు జారీ చేస్తామని, సమ్మె కాలం వేతనం అందజేస్తామన్నారు. కానీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. తమ హక్కుల సాధన కోసం గత 15 సంవత్సరాలుగా వివిధ సందర్భాల్లో పోరాటాలు చేస్తూనే వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా తమ సమస్యలను పట్టించుకోలేదు. డిమాండ్ల సాధనకు డిసెంబర్ 6వ తేదీ నుంచి జనవరి 7 వరకు వారు నిరవధికంగా సమ్మె కొనసాగించిన విషయం తెలిసిందే.

పరిగికి కొత్తకుంట శోభ

(ఐదో పేజీ తరువాయి)



కొత్తకుంట కట్ట వెడల్పు పనులు ఇలా..

జరుగుతున్నాయి. ఈ కుంటను ఆధునీకరణకు మరో రూ.మూడు కోట్లు అవసరం రీత్యా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కుంట అలుగును కొంత పెంచి కట్టను వెడల్పు చేయనున్నారు. కట్టపై సీసీ బెడ్ ఫ్లాట్ ఫామ్‌తోపాటు, ప్రత్యేక లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడే బతుకమ్మ, ఇతర ఉత్సవాలు నిర్వహించుకునేలా ఘాట్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దీనికితోడు గ్రీనరీని ఏర్పాటు చేయనున్నారు. పట్టణ ప్రజలు సేద తీరేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టనున్నారు.

పెరుగనున్న భూగర్భ జలాలు

కొత్తకుంట చెరువు, పరిసరాలను అందంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. పరిగి పట్టణంలో ఇంటింటికీ ఒక బోరు మోటారు ఉంది. వేసవిలో భూగర్భ జలాలు తగ్గి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటారు. పట్టణానికి దగ్గరగా ఉన్న కొత్తకుంటను బాగు చేస్తే నీటి ఎద్దడిని తీర్చవచ్చని భావిస్తున్నారు. ఈ కుంట మరమ్మతులతో బోర్లలో నీటిమట్టంపెరుగుతుందని పట్టణ ప్రజలు సైతం ఆశిస్తున్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

(ఐదో పేజీ తరువాయి)

వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలపారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళా శక్తి పథకం కింద పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 1.60 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ కింద రూ.490 కోట్లు అందించినట్లు వివరించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాం అందించారని తెలిపారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు.

పలు శాఖల పనితీరుపై అసంతృప్తి

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. కాగా, మైనింగ్, ఇరిగేషన్ శాఖల పని తీరు పట్ల ఎంపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పురోగతిపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డీఆర్‌డీవో శ్రీనివాస్, దిశ కమిటీ సభ్యులు అంతారం లలిత, వడ్ల నందు, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, జానకీరాం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కళాశాలల ప్రిన్సిపాళ్లు బాధ్యతల స్వీకరణ



దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వసంత

బొంరాస్‌పేట్/దుద్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్, హకీంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లుగా రోజారాణి, రమణికుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రోజారాణి గతంలో సికింద్రాబాద్‌లోని వైయంసీఏ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వం పదోన్నతి కల్పించడంతో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా దుద్యాల మండలంలోని హకీంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమణకుమారి బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లాలోని మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం అధ్యాపకురాలిగా విధులు నిర్వహించారు. పదోన్నతిపై హకీంపేట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు నూతన ప్రిన్సిపాల్‌లను శాలువాలతో సన్మానించారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వసంత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా వివిధ కళాశాలల్లో అధ్యాపకురాలిగా బాధ్యతలు నిర్వర్తించి పదోన్నతిలో భాగంగా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 108 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందారని, ఇంకా విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను ప్రధానోపాధ్యాయులు శ్రీహరిరెడ్డి, సాయిలు, నాయకులు వీరన్న, రిటైర్డ్ ఎంఈవో బాబుసింగ్, రిటైర్డ్ హెచ్ఎం ప్రభాక్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్: బాధ్యతలు స్వీకరిస్తున్న రోజారాణి



దుద్యాల: బాధ్యతలు స్వీకరిస్తున్న రమణకుమారి

ఓటరుగా నమోదు చేసుకోవాలి



రాజకీయ నాయకులతో సమావేశంలో తహసీల్దార్

కొడంగల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ విజయ్ కుమార్ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై చర్చించారు. పార్టీల నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా బూత్ లెవల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన



విద్యార్థులకు ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న వేదిక మహిపాల్‌రెడ్డి

తాండూరు: విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో మంగళవారం వేదిక విశిష్ట పాఠశాలలో మాక్ ఓటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నలుగురిపై రౌడీషీట్

బషీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసులో నిందితులుగా ఉన్న నాలుగురిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెల 4న మండలంలోని నవాల్గ శివారు వ్యవసాయ పొలంలో మాలశ్యామప్ప(38)ను సొంత వదిన మాల సుగుణమ్మ, అదేగ్రామానికి చెందిన మాల శివ కుమార్, కొత్త విజయ్‌కాంత్, గొట్టిగ విశ్వనాథ్‌లకు సుపారి ఇచ్చి హత్య చేయించినట్లు అప్పటి విచారణలో తేలిందన్నారు. ఈ హత్య కేసులో నేరస్థులుగా గుర్తించి అప్పట్లో నలుగురిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ఆదేశాలతో జైలుకు పంపించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం నలుగురు నిందితులపై నేరచర్యలు పునరావృతం కాకుండా చూసేందుకు రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. పాతనేరస్థుల నడవడికపై ఎప్పటికప్పుడూ ప్రత్యేకనిఘా ఉంచుతామని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

డిటోనేటర్లు స్వాధీనం.. ఆరుగురిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక నుంచి డిటోనేటర్లు తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యంనంపేట్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో రెండు కార్లల్లో రూ.12వేల నిషేధిత డిటోనేటర్లను పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్నవారిని అదుపులోకి తీసుకుని విచారించగా హనుమకొండలోని భీమారం మండలం గోపాలపూర్‌కు చెందిన బొమ్మకంటి వేణుగోపాల్, యాదాద్రి-భువనగిరి జిల్లా పోచంపల్లికి చెందిన గుండు శ్రీనాథ్, తాటిపల్లి రవీందర్, కర్ణాటకకు చెందిన సంగన్‌గౌడ, వడిలప్పగౌడ, బసప్పగౌడను అరెస్టు చేశారు. కర్ణాటకలోని సాయి ఎంటర్‌ప్రైజెస్ నుంచి డిటోనేటర్లు కొనుగోలుచేసి యాదాద్రి-భువనగిరి జిల్లా కప్రాయపల్లిలోని వెంకటేష్‌కు అప్పగించేందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. డిటోనేటర్లతో పాటు రెండు కార్లను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ పట్టణంలోని బస్టాండ్‌లో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను అనారోగ్యంతో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పశు వైద్యుల నిర్లక్ష్యం.. గేదె మృత్యువాత

పూడూరు, జూలై 15, (ఆంధ్రజ్యోతి): పశువైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ గేదె మృత్యువాతపడింది. ఈ ఘటన మండలంలోని చీలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చీలాపూర్ గ్రామానికి చెందిన రైతు కుర్వ సత్యంకు చెందిన గేదె మంగళవారం లేగదూడకు జన్మనిచ్చింది. ఈత సమయంలో గేదె గుడ్ల మాయ బయటికి రావడంతో వెంటనే రైతు సత్యం పశువైద్యులకు సమాచారం అందించాడు. అయినప్పటికీ వైద్యులు రాలేదు. పశువైద్యులు సమయానికి చేరుకోకపోవడంతో గేదె మృత్యువాతపడింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన గేదె మృతి చెందిందని రైతు సత్యం ఆరోపించారు. గేదె మృతికి కారణమైన వైద్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్ చేశాడు.

అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో తల్లీబిడ్డతో కుటుంబసభ్యులు, సిబ్బంది

బషీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. ఈ ఘటన బషీరాబాద్ మండలం కాశీంపూర్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. దామర్‌చెడ్ గ్రామానికి చెందిన హరిజన్ అంబికా(22)కు పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. తాండూరులోని మాతా శిశు, ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో కాశీంపూర్ వద్దకు రాగానే నొప్పులు అధికమయ్యాయి. పైలెట్ పైలెట్ ఎండీ.నసీరోద్దీన్ వాహనాన్ని పక్కకు నిలపడంతో ఈఎంటీ జి.ప్రకాష్ డెలివరీ చేశారు. అంబికా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తాండూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ జి.ప్రకాష్ తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



పోతరాజుల వేషధారణలో విద్యార్థుల విన్యాసాలు

కులకచర్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాలను పురస్కరించుకొని స్థానిక న్యూ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అంగరంగ వైభవంగా విద్యార్థులు బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపులో విద్యార్థుల పోతరాజు విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అదే విధంగా ఉపాధ్యాయులు బోనాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి, కరస్పాండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



పాటిమీదిపల్లిలో భూమిపూజ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

పరిగి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో మొహ్మద్ కరీమ్ అన్నారు. మంగళవారం పరిగి మండలంలోని గడిసింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రాములు, పంచాయతీ కార్యదర్శి మొగులయ్య, గ్రామస్థులు రాఘవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

కొడంగల్ రూరల్: కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారమవుతుందని ఆ పార్టీ కొడంగల్ మండల ఉపాధ్యక్షుడు వార్ల సంతోష్‌కుమార్ అన్నారు. పాటిమీదిపల్లిలో మంగళవారం ఇందిరమ్మ లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులకు పంచాయతీ కార్యదర్శి సుభాన్‌తో కలిసి భూమిపూజ చేశారు.

సంక్షిప్తంగా..

కాంగ్రెస్ బుద్లాపూర్ గ్రామ అధ్యక్షుడిగా సురేష్

దోమ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బుద్లాపూర్ గ్రామ అధ్యక్షుడిగా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. కాంగ్రెస్ పార్టీ దోమ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఈ ఎన్నిక జరిగింది. అనంతరం సురేష్‌ను పలువురు శాలువాతో సన్మానించారు.

మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్‌కు పరామర్శ

బషీరాబాద్: బషీరాబాద్ మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కె.మాణిక్‌రెడ్డిని ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన మాణిక్‌రెడ్డి తాండూరులోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మహేందర్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీవన్గి మాజీ సర్పంచ్ నవనీత సుదర్శన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్‌చేయించి శాలువాతో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరుణం పురుషోత్తంరావు, మాజీ కౌన్సిలర్ పరిమళ, భగవాన్, సిద్దు పాల్గొన్నారు.

ముద్దాయిపేట్ ఎస్సీ కాలనీలో బోరు

యాలాల: మండలంలోని ముద్దాయిపేట్ ఎస్సీ కాలనీలో మంగళవారం బోరు వేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో బోరు వేసి నీటి సమస్యను పరిష్కరించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆరీఫ్ హుస్సేన్, బస్వరాజ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కళాబృందంతో అవగాహన

దౌల్తాబాద్: ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లాబాద్ గ్రామంలో జిల్లా పోలీసు కళాబృందంతో మాదకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి, కోకాయిన్ నిషేధం, రోడ్డు భద్రతా, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆన్‌లైన్ మోసాలు, మహిళలపై జరుగుతున్న దాడులు, డయల్ 100, షీ టీం 181, బాల్య వివాహాల నిర్మూలన, మానవ అక్రమ రవాణా, చైల్డ్‌లైన్ 1098, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు

దోమ: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని ఉదన్‌రావుపల్లి గ్రామానికి చెందిన గుడిసె గణేశ్‌కు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60వేలు చెక్కును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజిలయ్య, ఎల్లప్ప, రమేశ్, నర్సింహులు, అంజిలయ్య, సతీశ్, బురాన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీ

చౌడాపూర్: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కావలి గోపాల్, ఉపాధ్యక్షుడిగా పరిగి రాములు, బుడగజంగం యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా దాసరి నర్సింహులు, కార్యదర్శిగా పల్లెమోని నర్సింహులు, సంగరమోని శ్రీను, కోశాధికారిగా దాసరి జంగయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా దండు నరేశ్, ఉపాధ్యక్షుడిగా పరిగి నవీన్, కార్యదర్శిగా మణికంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.